క్లుప్తంగా

యోగాతో ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న గురువు సురేష్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: క్రమం తప్పకుండా యోగ చేయడం వల్ల ఆరోగ్యం, మానసిక ఉల్లాసం వస్తుందని యోగా గురువు సురేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని కృష్ణమందిరంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యోగాను సాధన చేస్తే ఆనందంగా జీవించవచ్చని తెలిపారు.

సైన్స్ విజ్ఞాన సదస్సుకు తరలిన విద్యార్థులు

ఏర్పేడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు తిరుపతిలో జరిగే సైన్స్ విజ్ఞాన సదస్సుకు తరలి వెళ్లారు. తిరుపతిలోని నెహ్రూ పాఠశాలలో సైన్స్ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాలకు చెందిన 6, 7 తరగతుల విద్యార్థులు తయారు చేసిన రసాయనిక, భౌతిక శాస్త్ర ప్రయోగాలను తీసుకుని వెళ్లి తిరుపతిలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెంగల్ రాయులు, మోహన్ బాబు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

ఏర్పేడు: మండలంలోని సరస్వతికండ్రిగలో ఇటీవల సుబ్బమ్మ(70) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డిని గ్రామానికి పంపించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అయోధ్య, చంద్రారెడ్డి, మైరావణ, చల్లా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్యం



నాట్యాన్ని ప్రదర్శిస్తున్న మోహుల్ ముఖర్జీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వర స్వామివారి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్త కన్నప్ప ధ్వజారోహణ ఉత్సవాన్ని పురస్కరించుకుని ధూర్జటి కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోల్‌కతాకు చెందిన శివ మల్లారి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ కళాకారిణి మోహుల్ ముఖర్జీ చేసిన భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం అద్వితీయంగా సాగింది.

నేడు వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ

రేణిగుంట: పట్టణంలోని ఫ్లై ఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆవిష్కరించనున్నట్లు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పేరూరు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేయనున్నట్లు వివరించారు.

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి రెండు రోజులపాటు జాతీయ అంచనా, అక్రిడేషన్ సిబ్బంది కళాశాలను పరిశీలించారని తెలిపారు. ప్రధానంగా కళాశాలలో పరిశోధన కేంద్రాలను, తరగతి గదులు, మౌలిక వసతులను నిశితంగా పరిశీలించారని తెలియజేశారు. ప్రిన్సిపల్, బోధన బోధనేతర సిబ్బంది కృషి ఫలితంగా ఈ విషయం సాధించామని డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం

శ్రీకాళహస్తి: పట్టణంలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 70 మంది తమ సేవలను అందించారు. 14 కేంద్రాల్లో వీరు 5 సంవత్సరాలోపు పిల్లలను తీసుకువచ్చి పోలియో చుక్కలను వేయించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, పార్వతి, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన

శ్రీకాళహస్తీశ్వరాలయం





ఆలయం వెలుపల ధ్వజస్తంభం వద్ద ఆకట్టుకుంటున్న పూల అలంకరణలు, భిక్షాల గాలిగోపురం వద్ద..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆదివారం నుంచి భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు, పూల అలంకరణలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. భిక్షాల గాలిగోపురం, దక్షిణ గాలిగోపురం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం చేపట్టనున్నారు. 8వ తేదీన మహాశివరాత్రి ఉత్సవం. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నాలుగు మాడ వీధుల్లో విద్యుత్ దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు.

స్వామి, అమ్మవార్లకు వస్త్రాల వితరణ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి అలంకరించేందుకు చెన్నైకి చెందిన వ్యాపారవేత్త దొరై నాగరాజన్ ఆదివారం 13 పంచెలు, 26 చీరలు అందజేశారు. వీటిని ఈవో ఎస్వీ నాగేశ్వరరావు స్వీకరించారు. ఆయనకు స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం అందజేసి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ మల్లికార్జునప్రసాద్, ఏఈవో ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.



టీషర్టులు, పంచెలు అందజేస్తున్న దాతలు

మోతకూలీలకు టీషర్టులు, పంచెలు వితరణ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపులో మోత కూలీలకు ఆదివారం శ్రీకాళహస్తి, నాయుడుపేటకు చెందిన సురేష్, రమేష్ 300 టీషర్టులు, 300 పంచెలు అందజేశారు. వాటిని ఈవో ఎస్వీ నాగేశ్వరరావు స్వీకరించారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఆలయ ఏసీ మల్లికార్జునప్రసాద్, ఏఈవో ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈవో

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఈవో ఎస్వీ నాగేశ్వరరావు పరిశీలించారు. నాలుగు గోపురాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యూలైన్లు పటిష్టంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ నూకరత్నం పాల్గొన్నారు.



దక్షిణగోపురం వద్ద..





ఆలయంలో పూల అలంకరణలు







భక్తకన్నప్ప ఊరేగింపు, పెండ్లి మండపం వద్ద వేసిన చలువ పందిరి, బియ్యపు కృష్ణారెడ్డి మండపం వద్ద వేసిన చలువ పందిరి

భక్తునికి ప్రథమ పూజ అనుగ్రహించిన భవుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : భక్తుడైన కన్నప్పకు ప్రథమ పూజను అనుగ్రహించిన పరమశివుడు శ్రీకాళహస్తీశ్వరుడని శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయన ఆదివారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల వేదిక ధూర్జటి కళాప్రాంగణాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూగజీవాలైన సాలెపురుగు, సర్పము, ఏనుగును తనలో ఐక్యం చేసుకుని ముక్తిని ప్రసాదించిన స్వామివారు భోళా శంకరుడని తెలిపారు. అటువంటి పుణ్యక్షేత్రంలో నివసించిన ధూర్జటి మహాకవి తన శతక కావ్యంలో స్వామివారిని కీర్తించినట్లు పేర్కొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల వేదికను ఆయన పేరుతో ధూర్జటి కళాప్రాంగణంగా నామకరణం చేయడం హర్షనీయమని తెలిపారు. ఈ కళావేదిక నుంచి ప్రదర్శనలు ఇచ్చేందుకు కొందరికి మాత్రమే అవకాశం లభించడం ఆ శివుని అనుగ్రహమని చెప్పారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఇంత ఘనంగా ప్రారంభించడానికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తాజా మాజీ పాలక మండలి చైర్మన్, సభ్యుల సహకారం ఎంతగానో దోహదపడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఏకాంబరం, ఏసీ మల్లికార్జున్, స్వర్ణమూర్తి పాల్గొన్నారు.



మీడియా పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఈవో నాగేశ్వరరావు, బియ్యపు పవిత్రారెడ్డి

మీడియా పాయింట్ ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మీడియా పాయింట్‌ను ప్రారంభించారు. ఈవో నాగేశ్వరరావు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామధేనువుపై గరళ కంఠుడి చిద్విలాసం



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం గరళ కంఠుడు కామధేను వాహనంపై ఊరేగారు. ఉదయం పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం కామధేను వాహనంపై అధిష్టింపజేసి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. చెన్నైకి చెందిన నరసింహులు రేవతి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజి రెడ్డి, కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్ర, ట్రస్టు బోర్డు మెంబరు ఆనందయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు స్వార్థపూరిత హామీలు నమ్మొద్దు



ముస్లింపాళెం: కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: ఎన్నికల సమయంలో అధికారం కోసం చంద్రబాబు చెప్పే స్వార్థపూరిత హామీలను నమ్మవద్దని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి తెలిపారు. ఆయన ఆదివారం నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మరికొన్నింటికి భూమిపూజ చేశారు. ముస్లింపాళెంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. సీఎల్ఎన్‌పల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, మరదవాడలో రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్బీకేను ప్రారంభించారు. సంతవేలూరులో రూ.12 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. సీఎల్ఎన్‌పల్లి నుంచి కళత్తూరు గిరిజనకాలనీకి వెళ్లే సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ సంక్షేమ సంఘం డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, శ్రీకాళహస్తిరాలయ ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివా యాదవ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, స్థానిక ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



ముస్లింపాళెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త రాజేష్

చిన్నారులకు పోలియో చుక్కలు

వరదయ్యపాళెంలో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఎంత మంది ఏకమైనా జగనన్నే మళ్లీ సీఎం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంత మంది ఏకమైనా ప్రజాబలం జగనన్నకు ఉందని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అవుతారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్, కరకంబాడి, దొడ్లమిట్ట, రాజీవ్‌గాంధీ కాలనీ, దళితవాడ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి, శ్మశానవాటిక నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయలేదన్నారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపద అని వచ్చిన వారి సమస్యలను పరిష్కరించేందుకు చాయశక్తులా పని చేశానన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే కల్లబొల్లి మాటలు చెప్పి, గెలిచాక హైదరాబాద్‌కు పారిపోయే మాయల మరాఠీల మాటలను నమ్మవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పేరూరు మునిరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మ, మన్యం శ్రీనివాసులురెడ్డి, యోగేశ్వరరెడ్డి, శ్రీను యాదవ్, కృష్ణమూర్తి, ప్రకాష్, ఎంపీటీసీ కన్నయ్య, సుబ్రమణ్యం, బాబు, సుధారాణి, లత, తహసీనా, అమ్ములు పాల్గొన్నారు.

ఘనంగా అమర ఆస్పత్రి వార్షికోత్సవం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రి 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు పాల్గొన్నారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని, చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని మాట్లాడుతూ అమెరికాలో వైద్యరంగంలో స్థిరపడిన తాము సొంత ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే ఇక్కడ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రి నెలకొల్పి అంతర్జాతీయ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఆస్పత్రి జీజీఎం శ్రీధర్, సీఏవో వేణుగోపాల్, పీఆర్వో మునినాథం తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి గల్లా అరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని

ఆలయానికి నగదు విరాళం

ఏర్పేడు: మండలంలోని కందాడు దళితవాడలో నిర్మిస్తున్న అంకమ్మ ఆలయానికి బండారుపల్లికి చెందిన భక్తవత్సలరెడ్డి రూ.10 వేలు విరాళమిచ్చారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యుడు పారి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయాలని కోరారు.

పండంటి జీవితానికి రెండు చుక్కలు

సత్యవేడు: తల్లిదండ్రులు తమ చంటి పిల్లల పండంటి జీవితానికి రెండు చుక్కల పోలియో మందు వేయించాలని సత్యవేడు జెడ్పీటీసీ విజయలక్ష్మి కోరారు. ఆదివారం ఆమె స్థానిక కమ్యూనిటీ సెంటర్‌లో దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు గుణశేఖర్, మురళీకృష్ణ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డితో కలసి పోలియో చుక్కలు వేశారు. మండలంలో 3,933 (96 శాతం) మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు తెలిపారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం తొలిరోజే వందశాతం పూర్తి అయినట్లు పీహెచ్‌సీ డాక్టర్లు కుమార్, సరస్వతి తెలిపారు. 22 పోలియో కేంద్రాల ద్వారా 2908 గానూ 2900 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య మండల కేంద్రంలో చిన్నపిల్లలక పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు ఎస్.వాణి, ఎంపీహెచ్‌ఓలు రాజు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 3,608 మంది పిల్లలు ఉండగా 3,536 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేశామని, 98 శాతం పూర్తి అయినట్లు వైద్యాధికారులు మాధవి, దివాకర్ తెలిపారు. మిగిలిన వారికి సోమవారం వేసి 100 శాతం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వేంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: ఐదేళ్లలోపు పిల్లలు పోలియో చుక్కలు తప్పక వేసుకోవాలని స్థానిక సర్పంచ్ చిన్నదురై సుధ అన్నారు. వేదనారయణ స్వామి ఆలయం వద్ద స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో పోలియో చుక్కలు వేశారు.



సత్యవేడు: కమ్యూనిటీ సెంటర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ విజయలక్ష్మి

పిచ్చాటూరులో 95 శాతం పూర్తి

పిచ్చాటూరు: మండలంలో 95 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ హమీద్ తెలిపారు. మిగిలిన 5 శాతం చిన్నారులకు సోమ, మంగళవారాల్లో పోలియో చుక్కలు వేస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మునిచరిత్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో పల్స్ పోలియో 93 శాతం పూర్తి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 93 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో రఫీఖాన్ తెలిపారు. ఆయన ఎంపేడు పీహెచ్‌సీలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 40 కేంద్రాల్లో 6,677 మందికి గాను 6,226 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మండల వైద్యాధికారులు సుధీర్ కుమార్, రాహుల్‌రాజ్, రంజిత, ముంతాజ్, ఆరోగ్య సిబ్బంది జ్యోతి, మధుమోహన్, ప్రవళిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. చుక్కలనిడిగల్లు పంచాయతీలో సర్పంచ్ చుక్కల కిరణ్ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

తొట్టంబేడులో...

తొట్టంబేడు పీహెచ్‌సీ పరిధిలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎంపీపీ నిర్మలమ్మ ప్రారంభించారు. కాసరం పీహెచ్‌సీ పరిధిలో 2,122 మందికి గాను 2,048 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. తొట్టంబేడు పీహెచ్‌సీ పరిధిలో 3,282 మంది పిల్లలకు గాను 3,117 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారిణి తేజస్విని తెలిపారు.

పల్స్‌పోలియో విజయవంతం

రేణిగుంట: మండలంలో పల్స్ పోలియో విజయవంతమైనట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలో 9,191 మంది పిల్లలకు గాను 8,975 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఇందుకోసం 38 కేంద్రాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. అలాగే గాజులమండ్యంలో సర్పంచ్ గంగారి రమేష్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ కిరణ్

రెండు చుక్కలతో నిండు జీవితం

ఏర్పేడు: మండలంలోని ఏర్పేడు, పాపానాయుడుపేట పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మల్లంపల్లిలో ఎంపీపీ గీత, పాపానాయుడుపేట, కోబాకలో డాక్టర్లు నాగరాజు, రాజేష్, ఏర్పేడు, అంజిమేడు, పాపానాయుడుపేట, మేర్లపాక, ఎండీపుత్తూరులో సర్పంచ్‌లు శివయ్య, మోహన్‌రెడ్డి, లలిత, గంగాధరం, మోహనప్రియ, ఏర్పేడు బస్టాండులో ఐఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఏర్పేడు పీహెచ్‌సీ పరిధిలో 4,020 మంది పిల్లలకు గాను 3,011 మందికి, పాపానాయుడుపేట పీహెచ్‌సీ పరిధిలో 2,625 మందికి గాను 2,525 మందికి చుక్కలు వేసినట్లు డాక్టర్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెంగల్‌రాయులు, మహేష్, సీహెచ్‌వో శివరాజు, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



బుచ్చినాయుడుకండ్రిగ: పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో స్టేట్ బ్యాంకు పక్కన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆదివారం నాయకులు ప్రారంభించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు గోపాల్ రెడ్డి, రవిరెడ్డి, సాయినాయుడు, ఉగ్గుమూడి గురునాథం, సురుటుపల్లి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, గురవయ్య, ఎంపీటీసీ సభ్యులు రవి, నాయకులు గురవయ్య, ప్రసాద్ పాల్, జయచంద్రనాయుడు, కిరణ్‌యాదవ్, సర్పంచ్ జనార్దన్, ధర్మయ్య, చిరంజీవి, దేవదాసురెడ్డి, అమరలింగయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లిలో శ్రీ మాతమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారి విగ్రహానికి, శూలానికి అభిషేక పూజలు చేపట్టి అలంకరించారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.